# సాక్షి
## భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం : 29 : మార్చి : 2024




**క్రీస్తు త్యాగాన్ని స్మరిస్తూ..**
చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా, క్రీస్తు త్యాగనిరతికి చిహ్నంగా నేడు జరుపుకునే గుడ్‌ఫ్రైడేకు చర్చిల్లో ఏర్పాట్లు చేశారు. 10లో



**తపాలా.. రోజంతా కళకళ**
ఒకప్పుడు ఉత్తరాలు, మనియార్డర్లకే పరిమితమైన తపాలా కార్యాలయాల్లో ప్రస్తుతం అనేక రకాల సేవలు అందుతున్నాయి. 12లో



**వాతావరణం**
గరిష్టం / కనిష్టం
39° / 24°
జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.




## న్యూస్‌రీల్

### నేత్రపర్వంగా రామయ్య నిత్య క్రతువు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

**పాల్వంచరూరల్ :** మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.సుదర్శన్, అర్చకులు, వేద పడింతులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

### 'అమ్మ కోసం' ఆరంభం



బాలింతలతో మాట్లాడుతున్న డాక్టర్ చైతన్య

**కొత్తగూడెంరూరల్:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు బాలింతలు, పిల్లలు మృత్యువాత పడకుండా రక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన అమ్మ కోసం కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌ఓ శిరీష ఆధ్వర్యంలో మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ చైతన్య పర్యవేక్షణంలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద జిల్లాలోని బాలింతలు, చిన్నారులకు ఏడాది పాటు వైద్య సేవలు అందిస్తారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ.. పిల్లల్లో రక్తహీనత, పోషణ సమస్య ఏర్పడినా, గర్భిణులకు ఏవైనా సమస్యలు ఏర్పడినా జిల్లాలో అందుబాటులో లేని చికిత్స కోసం రాష్ట్రంలోని ఇతర పెద్దాస్పత్రులకు పంపిస్తామని తెలిపారు. బాలింతలు, పిల్లల మరణాలు సంభవించకుండా చూస్తామన్నారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి గురువారం బాలింతలను పరీక్షించి చికిత్సతోపాటు, సలహాలు ఇస్తామని చెప్పారు. జిల్లాలోని బాలింతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రెజ్లింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలి

**కొత్తగూడెంటౌన్:** జిల్లాలో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో రెజ్లింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి పి.పరంధామరెడ్డిని రెజ్లింగ్ అసోసియేషన్ పి.కాశీహుస్సేన్ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్, జాతీయ సీనియర్ క్రీడాకారుడు ఏ.వెంకటప్రసాద్, కె.నవీన్, వై.జంపన్న తదితరులు పాల్గొన్నారు..

# ఏకాభిప్రాయం కుదరట్లే!

**ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ**

- తమ కుటుంబీకులకే కావాలని మంత్రుల పట్టు
- హైదరాబాద్ నుంచి ఢిల్లీకి చేరిన టికెట్ కసరత్తు
- ఎటూ తేల్చుకోలేకపోతున్న పార్టీ అధిష్టానం
- ఈనెల 31న చివరి జాబితాలో ప్రకటించే అవకాశం



**ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి** ఎంపికపై కాంగ్రెస్ పార్టీ ఎటూ తేల్చుకోలేకపోతోంది. మొన్నటి వరకు హైదరాబాద్‌లో కసరత్తు జరగగా ఇప్పుడు ఢిల్లీకి చేరింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కుటుంబీకులు టికెట్ రేసులో ఉండగా.. మరికొందరూ టికెట్ ఆశిస్తున్నారు. ఇటీవల రెండుసార్లు టికెట్ విషయమై రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ ఆధ్వర్యాన పార్లమెంట్ స్థానం పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలతో సమావేశం జరిగింది. అయినా అభ్యర్థి ఎంపికపై ఏకాభిప్రాయం రాకపోగా, తమ కుటుంబానికే టికెట్ ఇవ్వాలని ప్రధానంగా భట్టి, పొంగులేటి పట్టుబడుతున్నారు. దీంతో చివరకు ఎవరిని అభ్యర్థిగా నిర్ణయిస్తారు.. ఇతర ఆశావహుల వైపు పార్టీ ఆలోచన చేస్తుందా అన్న అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది.
– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

**హస్తినలో లాబీయింగ్**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ మినహా మిగతా స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. తొలి జాబితాలోనే ఖమ్మం అభ్యర్థి ప్రకటన ఉంటుందని ఊహించిన ఆశావహులకు నిరాశే ఎదురైంది. ప్రకటన ఆలస్యమవుతుండగా ఆశావహులు టికెట్ కోసం తమ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేస్తున్నారు. ఢిల్లీలో మకాం వేసి లాబీయింగ్‌లో నిమగ్నమయ్యారు. తాజాగా జరిగిన కమిటీ సమావేశానికి రాష్ట్రం నుంచి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు ఆశావహులు కూడా ఢిల్లీ చేరుకుని ఎన్నికల కమిటీ భేటీలో తమ పేరు ప్రస్తావనకు వచ్చిందా.. లేదా అని ఆరా తీశారు. ఇదే రోజు ఖమ్మం అభ్యర్థి ప్రకటన ఉంటుందని భావించినా, ఎన్నికల కమిటీ పెండింగ్‌లో పెట్టింది.

**ఎవరికి దక్కేనో..?**

ఖమ్మం స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరనే చర్చ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. ఇక్కడి నుంచి ముగ్గురు మంత్రులు ఉండడంతో వారి కుటుంబీకుల్లో ఒకరికి టికెట్ ఇస్తారా, లేక మిగతా ఆశావహులకు అధిష్టానం ఆశీస్సులుంటాయా.. అన్న ఉత్కంఠకు తెరపడడం లేదు. రోజురోజుకూ కొత్త వారి పేర్లు ప్రచారంలోకి వస్తుండడం గమనార్హం. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని, మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, పార్టీ నాయకులు జెట్టి కుసుమకుమార్, జావిద్, నాగ సీతారాములు, లోకేష్‌యాదవ్, మానుకొండ రాధా కిషోర్ టికెట్ ఆశిస్తూ తమ నేతల ద్వారా ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

**ఈనెలాఖరులో..**

కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ఈనెల 31న ఢిల్లీలో సమావేశమై ఖమ్మం, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించనుందని తెలుస్తోంది. దీంతో ఈ రెండు రోజుల్లో ఏయే మార్పులు జరుగుతాయి, టికెట్ ఎవరికి దక్కుతుందని ఆశావహులు ఆలోచనలో పడ్డారు. ఖమ్మం స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావు, బీజేపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును ఇప్పటికే ప్రకటించారు. ఇందులో బీజేపీ అభ్యర్థి ప్రచారం మొదలుపెట్టగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి ఈ నెలాఖరు నుంచి ప్రచారానికి సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటిస్తే పార్లమెంట్ ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది. అయితే, అభ్యర్థిని త్వరగా ప్రకటిస్తేనే.. విజయంతో పాటు మెజార్టీ పెరిగే అవకాశాలుంటాయని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

**తెరపైకి ప్రియాంకగాంధీ!**

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మెజార్టీ అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోవడంతో ఖమ్మం లోక్‌సభ స్థానం కూడా సునాయాసంగా తమ ఖాతాలో చేరుతుందని పార్టీ భావిస్తోంది. అయితే టికెట్ కోసం మంత్రుల కుటుంబీకులు, మరోవైపు ముఖ్య నేతలు పోటీ పడుతుండడంతో అభ్యర్థి ఎంపిక కొలిక్కి రావడం లేదు. ఈనేపథ్యాన వీరెవరికీ టికెట్ ఇవ్వకుండా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీని బరిలో దించాలని అధిష్టానం ఆలోచన చేసినట్లు సమాచారం. ఆమె ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి పోటీకి దిగుతుండగా.. రెండు స్థానాల నుంచి పోటీ చేస్తారా.. లేదా అన్నది తేలాల్సి ఉంది. ఆమె నిరాకరించే పక్షంలో రేసులో ఉన్న ఒకరికి ఈ టికెట్ కేటాయించనున్నారు.

# ప్రయాణంతోనే సరి..



కేఎస్‌ఎంలోని మెడికల్ కళాశాల



రామవరంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం

- మూడు ముక్కలుగా మెడికల్ కాలేజీ
- హాస్టళ్లు ఒకచోట.. తరగతి గదులు మరో చోట
- రాకపోకలతో విద్యార్థులకు తప్పని అవస్థ
- 20 కిలోమీటర్లు వచ్చి వెళ్తుండడంతో సమయం వృథా

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** మెడికల్ కాలేజీ ఏర్పాటు విషయంలో సరైన ప్రణాళిక కొరవడటంతో ప్రస్తుతం వైద్య విద్య మూడుముక్కలాటగా మారింది. హాస్టల్ నుంచి ఆస్పత్రి వరకు ప్రతీ రోజు విద్యార్థులు ఇరవై కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేయాల్సి వస్తోంది.

**ఊహించని వరం..**

కొత్త జిల్లాగా ఏర్పాటైన తర్వాత ఊహించని వరంగా జిల్లాకు మెడికల్, నర్సింగ్ కళాశాలలు మంజూరయ్యాయి. దీంతో కొత్తగూడెం పట్టణంలోని 100 పడకల ఏరియా ఆస్పత్రిని అప్పటికప్పుడు 220 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. అలాగే రామవరంలో 100 పడకల సామర్థ్యంతో ఉన్న మాతాశిశు ఆస్పత్రిని సైతం ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి మొత్తంగా 320 పడకల సామర్థ్యాన్ని చూపించి నేషనల్ మెడికల్ కమిషన్ నుంచి అనుమతులు సాధించారు. మరోవైపు తరగతి గదుల కోసం కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ (కేఎస్‌ఎం) క్యాంపస్‌లో 30 ఎకరాల స్థలం కేటాయించారు. ఇందులో ముందుగా నర్సింగ్ కాలేజీ భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనాల్లోనే మెడికల్ కాలేజీ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులు 149 మంది, ప్రథమ సంవత్సరం వారు 150 మంది చదువుతున్నారు.

**అందుబాటులో లేని భవనాలు..**

వైద్య కళాశాల, బాలుర, బాలికల, హౌస్ సర్జన్ల హాస్టళ్లకు సంబంధించిన భవనాలు ఇంకా అందుబాటులోకి రాలేదు. బాలుర హాస్టల్‌ను కేఎస్‌ఎం సమీపంలోని మంచికంటి నగర్‌లో, బాలికల హాస్టల్‌ను పాల్వంచ మార్కెట్‌లో ఏర్పాటు చేశారు. దీంతో పాల్వంచ మార్కెట్ నుంచి కేఎస్‌ఎం క్యాంపస్‌లో ఉన్న మెడికల్ కాలేజీకి, ఆ కాలేజీ నుంచి రామవరం, కొత్తగూడెంలోని ఆస్పత్రులకు రోజూ విద్యార్థులు ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఇక అమ్మాయిలైతే పాల్వంచ మార్కెట్ నుంచి రామవరం వరకు ఇంచుమించు ఇరవై కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. తరగతులు ఒక చోట, ఆస్పత్రులు రెండు చోట్ల, హాస్టళ్లు మరో రెండు చోట్ల ఉన్నాయి. దీంతో హాస్టల్ నుంచి కాలేజీకి, అక్కడి నుంచి ఆస్పత్రికి వెళ్లడం, తిరిగి కళాశాలకు వచ్చి తరగతులు విన్నాక మళ్లీ హాస్టల్‌కు వెళ్లాల్సి రావడంతో విద్యార్థుల విలువైన సమయం వృథా అవుతోంది.

**కాలేజీ ఒక చోట.. ఆస్పత్రులు మరో చోట..**

వైద్య కళాశాల ఒకచోట, అనుబంధ ఆస్పత్రులు వేర్వేరు చోట్ల ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తగూడెంలో ఉన్న ప్రధాన ఆస్పత్రి నుంచి విజయవాడ రోడ్డులో ఐదు కిలోమీటర్ల దూరంలో రామవరం శివార్లలో మాతాశిశు ఆస్పత్రి ఉంది. దీనికి పూర్తి వ్యతిరేక దిశలో భద్రాచలం రోడ్డులో ఆరు కిలోమీటర్ల దూరంలో కేఎస్‌ఎం క్యాంపస్‌లో మెడికల్ కాలేజీ ఉంది. అంటే రామవరంలోని మాతాశిశు ఆస్పత్రి నుంచి కేఎస్‌ఎంలోని మెడికల్ కాలేజీ మధ్య సుమారు 12 కిలోమీటర్ల దూరం ఉంది. దీంతో ద్వితీయ సంవత్సరం నుంచి హౌస్‌సర్జన్ పూర్తయ్యే వరకు మూడేళ్ల పాటు విద్యార్థులు ప్రతీ రోజు ట్రాఫిక్ చిక్కులు దాటుకుంటూ 12 కిలోమీటర్ల దూరం ప్రయాణించక తప్పదు.

## 'పది' పరీక్షకు 97 మంది గైర్హాజరు

**కొత్తగూడెంఅర్బన్:** పదో తరగతి పరీక్షలు ఆరో రోజు గురువారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. రెగ్యులర్ విద్యార్థులు 12,341 మందికి 12,291 మంది, ప్రైవేటు విద్యార్థులు 375 మందికి 328 హాజరయ్యారని, మొత్తంగా 97 మంది గైర్హాజరయ్యారని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి వివరించారు. తాను నాలుగు కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 18 సెంటర్లలో తనిఖీ చేశాయని పేర్కొన్నారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. కాగా, కాచనపల్లి కేంద్రంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన చీఫ్ సూపరింటెండెంట్‌ను, డిపార్ట్‌మెంటల్ అధికారిని తప్పించామని, వారి బదులు ఇతరులను నియమించామని వెల్లడించారు.

# భక్తులకు సరిపడా ఏర్పాట్లు చేయాలి

**భద్రాచలం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 17, 18 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాలకు భక్తుల రాక పెరిగే అవకాశం ఉందని, అన్ని శాఖల అధికారులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ దామోదర్‌రావు, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి సూచించారు. స్థానిక సబ్ కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మిథిలా స్టేడియంలో కల్యాణ మండపాన్ని 26 సెక్టార్లుగా విభజించామని, ప్రతీ సెక్టార్‌లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రత్యేకాధికారులను నియమించామని తెలిపారు. భక్తులు ఒక సెక్టార్ నుంచి మరో సెక్టార్‌లోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాల పర్యవేక్షణకు 25 జోన్లుగా విభజించామని, ఇందుకు కేటాయించిన అధికారుల, సిబ్బంది జాబితా తమకు అందచేయాలని కోరారు. భక్తులకు తాగు నీటి సమస్య తలెత్తకుండా 200 మంచినీటి కుళాయిలు, నీటి సరఫరా పర్యవేక్షణకు 30 మంది, తాగునీటి పరీక్షల నిర్వహణకు 12 మంది సిబ్బందిని నియమించామని వివరించారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఫైరింజన్లతో పాటు సామగ్రిను సిద్ధం చేయాలని, రెస్క్యూ టీమ్‌లను అందుబాటులో ఉంచాలని సూచించారు. 24 గంటలు వైద్య సేవలు అందేలా కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని డీపీఆర్‌ఓను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్‌రావు, పక్కన ఈఓ రమాదేవి

# బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వండి

**ఖమ్మం అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు**

**చుంచుపల్లి:** ఖమ్మం పార్లమెంట్ స్థానానికి ఇంతవరకు అనేక పార్టీలకు అవకాశం ఇచ్చారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కోరారు. అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత తొలిసారి ఆయన గురువారం జిల్లాకు వచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.వి.రంగాకిరణ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు సుజాతనగర్ మండలం నాయకులగూడెం వద్ద ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యకర్తలతో భారీ బైక్ ర్యాలీగా కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఈ గడ్డపై పుట్టిన తాను 30 ఏళ్ల పాటు వ్యాపార, సాంకేతిక, సేవా రంగాల్లో గడించిన అనుభవంతో ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఉన్నానని చెప్పారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఐఐఎంలలో విద్యాభ్యాసం చేసిన నిపుణులు, అనుభవజ్ఞులతో విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఆదరిస్తే కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో మరిన్ని పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తానని, తద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. కొత్తగూడెం ప్రజలకు ఇళ్ల పట్టాల క్రమబద్ధీకరణ చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్‌ఎండీసీ ఆధీనంలో ఉన్న 600 ఎకరాల స్థలంలో ఇండస్ట్రియల్ క్లస్టర్, ఎయిర్ పోర్ట్ నిర్మాణం వంటివి తన అజెండాలో ఉన్నాయని చెప్పారు. ఇప్పటి వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీజేపీని గెలిపించకున్నా కేంద్ర ప్రభుత్వం రూ.12 వేల కోట్ల నిధులతో జాతీయ రహదారాలు, వైకుంఠధామాలు, రైతు వేదికలు, ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, క్రీడా ప్రాంగణాలు, వివిధ రకాల సంక్షేమ పథకాలు చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, కో–కన్వీనర్ జిల్లారపు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెరువు శ్రీనివాస్, నాయకులు ఆకుల నాగేశ్వరరావు, మాడివి రవి, నరేంద్రబాబు, గొడుగు శ్రీధర్, రాయుడు నాగేశ్వరరావు, భూక్యా రాజేష్ నాయక్, రాపాక రమేష్, పోలోజి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న వినోద్‌రావు, పక్కన నాయకులు

# ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

- తరుగు పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు
- కలెక్టర్ ప్రియాంక ఆల



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, ఇతర అధికారులు

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 1,11,369 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందనే అంచనాతో 128 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి అదనపు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. 'ఎ' గ్రేడ్ ధాన్యానికి రూ. 2,203, బీ గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధరగా నిర్ణయించినట్లు చెప్పారు. ఏప్రిల్ ఒకటో తేదీన 61, 5న 36, 10వ తేదీన 31 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలని, ఉల్లంఘిస్తే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలు, ఫొటోలు లేకుండా చూడాలన్నారు. ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు, హమాలీలు వడదెబ్బకు గురికాకుండా టెంట్లు, షేడ్‌నెట్‌లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్రాల్లో రద్దీ నియంత్రణకు వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్ ప్రకారం రైతులకు టోకెన్లు జారీ చేయాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా సరిహద్దుల్లో 8 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిత్యం ఆన్‌లైన్ చేసి రైస్ మిల్లులకు తరలించాలని, దిగుమతిలో జాప్యం లేకుండా రైస్ మిల్లర్లు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కేంద్రం ఇన్‌చార్జ్, మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ధాన్యం మద్దతు ధర, నాణ్యత ప్రమాణాల పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీఓ విద్యాచందన, సివిల్ సప్లై డీఎం త్రినాథ్‌బాబు, డీఎస్‌ఓ రుక్మిణీదేవి, డీసీఓ ఖుర్షీద్, వ్యవసాయాధికారి బాబూరావు, జీసీసీ మేనేజర్ విజయకుమార్, తూనికలు, కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి అలీం, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బాధ్యులు ఆనందరావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

**ఎన్నికల సిబ్బందికి 1,2వ తేదీల్లో శిక్షణ**

లోక్‌సభ ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందికి ఏప్రిల్ 1, 2 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం నియోజకవర్గ సిబ్బందికి పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, పినపాక నియోజకవర్గ సిబ్బందికి పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల, అశ్వారావుపేట నియోజకవర్గ సిబ్బందికి పాల్వంచ కేటీపీఎస్ కాలనీలోని డీఏవీ పాఠశాల, కొత్తగూడెం నియోజకవర్గ సిబ్బందికి కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాల, ఇల్లెందు నియోజకవర్గ సిబ్బందికి లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీ రామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శిక్షణ ఉంటుందని వివరించారు. పోస్టల్ బ్యాలెట్‌కు శిక్షణ కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి ఫోన్‌లో వచ్చిన మెసేజ్‌లో ఏమైనా సవరణలుంటే శిక్షణా కేంద్రంలో సంబంధిత అధికారులకు తెలియజేసి సరిచేసుకోవాలని పేర్కొన్నారు.

# మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

**మూడు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారుల భేటీలో నిర్ణయం**



సమావేశంలో పాల్గొన్న మూడు రాష్ట్రాల ఎక్సైజ్ అధికారులు

**బూర్గంపాడు:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన గంజాయి, మద్యం, నాటుసారా వంటి మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని ఎక్సైజ్ శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలోని ఐటీసీ సమావేశ మందిరంలో గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యాన మూడు రాష్ట్రాల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సరిహద్దు కలిగిన జిల్లాల ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. మద్యం, గంజాయి, నాటుసారా రాష్ట్రాలు దాటకుండా ఎక్కడికక్కడ నిఘా వేయాలని, బోర్డర్ చెక్‌పోస్టులను బలోపేతం చేయడంతో పాటు ఎన్నికలు ముగిసే వరకు తాత్కాలిక చెక్‌పోస్టులను సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు ముమ్మరం చేస్తే మద్యం, గంజాయి రవాణాను అరికట్టవచ్చని తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి మద్యం సరఫరా చేసే అవకాశం ఉన్నందున రహదారులపైనే కాక పడవలపైనా తరలించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ గణేష్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ఏపీలోని ఏలూరు, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బీజాపూర్ జిల్లాల అధికారులు సూర్యచందర్‌రావు, రామకృష్ణ, గజేందర్, రాథోడ్, రాహుల్, కరంచంద్, రహీమున్నీషా, సాంబమూర్తి, పట్టాభి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### తూనికలు, కొలతల శాఖ అధికారుల దాడులు

మణుగూరు టౌన్: మండలంలోని ఓ సూపర్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన ఓ వంటనూనె ప్యాకెట్ బరువు 200 గ్రాములు తక్కువగా ఉన్నట్లు ఫిర్యాదు రాగా, తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారులు గురువారం దాడులు చేశారు. దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా తూనికలు, కొలతలు అధికారి మనోహర్ మాట్లాడుతూ కొనుగోలుదారుడి ఫిర్యాదు మేరకు దుకాణంలోని అన్ని ప్యాకెట్లను పరిశీలించామన్నారు. ఒక ప్యాకెట్‌లో నిర్ధిత బరువు కంటే నూనె తక్కువగా ఉన్నట్లు గుర్తించామని, నెల్లూరుకు సంబంధించిన వంటనూనె కంపెనీపై కేసు నమోదు చేశామని తెలిపారు.

### జ్వరంతో మూడేళ్ల చిన్నారి మృతి


దేవాంశ్ (ఫైల్)

టేకులపల్లి: జ్వరంతో చికిత్స పొందుతూ మూడేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని స్టేషన్‌తడికలపూడి గ్రామానికి చెందిన ఉప్పల సుధాకర్, సృజన దంపతులకు ఇద్దరు కుమారులు మేఘనాథ్, దేవాంశ్ (3) ఉన్నారు. మంగళవారం డోర్నకల్‌లో సృజన పుట్టింట్లో బోనాలు ఉండగా, సుధాకర్ దంపతులు పిల్లలను తీసుకుని వెళ్లారు. మంగళవారం సాయంత్రం దేవాంశ్‌కు తీవ్ర జ్వరం వచ్చింది. స్థానికంగా వైద్యం చేయించినా తగ్గలేదు. బుధవారం అర్ధరాత్రి జ్వరం తీవ్రమైంది. ఫిట్స్ కూడా రావడం, వాంతులు మొదలయ్యాయి. దీంతో గురువారం తెల్లవారుజామున సుమారు 2 గంటలకు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, చేర్చుకోలేదు. దీంతో ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు.

### మోటారు వైర్లు చోరీ

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ మోటార్ల వైర్లను చోరీకి పాల్పడ్డ ఘటన గురువారం వెలుగుచూసింది. మండలంలోని పాత అల్లిగూడెం, పేరాయిగూడెం గ్రామాల రైతులు పూనెం రాములు, పీ ఆదినారాయణ, ఎండి మదార్‌లకు చెందిన వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్ల వైర్లు కత్తిరించుకుని అపహరించారు. చోరీకి గురైన కేబుల్ వైర్ల విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందని బాధిత రైతులు వాపోయారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉన్న బోరు మోటారు వైరు కూడా చోరీకి గురైనట్లు తెలిసింది. బాధిత రైతు రాములు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు.

### బైక్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ

ఇద్దరికి తీవ్రగాయాలు

అశ్వాపురం: మండల కేంద్రంలోనిమీనగర్ కాలనీ గేట్ ఎదుట బుధవారం రాత్రి ఇసుక లారీ బైక్‌ను ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. చవిటిగూడెం గ్రామానికి చెందిన బుర్ర ఉప్పయ్య, అశ్వాపురానికి చెందిన వేమూరి రత్నకుమారి గౌతమీనగర్ కాలనీలో ఫంక్షన్‌కు హాజరై రాత్రి బైక్‌పై తిరిగివస్తున్నారు. ఈ క్రమంలో కాలనీ గేట్ వద్ద రోడ్డు దాటుతుండగా మణుగూరు నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న ఇసుక లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికులు భద్రాచలం ఆస్పత్రికి తరలించారు.

### మద్యం సీజ్

దమ్మపేట: అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన బెల్టు షాపుపై గురువారం ఎఫ్‌ఎస్‌టీం, పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. మండల కేంద్రంలోని అర్బన్ కాలనీలో ఎఫ్‌ఎస్‌టీం అధికారి కృష్ణ, ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కలిసి బెల్ట్ షాపుపై దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 25 లీటర్ల మద్యం సీసాలను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన మద్యం విలువ రూ.35 వేలు ఉంటుందని ఎస్సై తెలిపారు.

### చెక్‌పోస్ట్ వద్ద రూ.1.98 లక్షలు స్వాధీనం


పట్టుకున్న నగదును చూపిస్తున్న అధికారులు

అన్నపురెడ్డిపల్లి : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పెంట్లం గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.1.98 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. సత్తుపల్లి నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న వ్యక్తుల వద్ద ఈ నగదు లభించిందని, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లొద్దని సూచించారు. స్వాధీనం చేసుకున్న నగదుకు సరైన ఆధారాలు చూపించి, తిరిగి తీసుకెళ్లొచ్చని తెలిపారు.

**పామాయిల్ గెలలు**

| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,045 |

# క్రీస్తు త్యాగాన్ని స్మరిస్తూ..


చెక్‌పోస్టు రొంపేడులోని చర్చి

- నేడు గుడ్ ఫ్రైడేకు సిద్ధం
- మందిరాలను ముస్తాబు చేసిన క్రైస్తవులు
- ఈ నెల 31న ఈస్టర్ పండుగ

ఇల్లెందురూరల్: క్షమాగుణం, పొరుగువారిపై ప్రేమ, బాధ్యతగా వ్యవహరించడం వంటి క్రీస్తు సందేశాలు మానవాళికి అనుసరణీయంగా ఉన్నాయి. పాపం చేసిన వారిని శిక్షించడం కంటే మనిషిలోని పాపాన్ని శిలువ వేయాలనేదే గుడ్ ఫ్రైడే సందేశం. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా గుడ్‌ఫ్రైడే జరుపుకుంటారు. శిలువపై క్రీస్తు పొందిన త్యాగపూరితమైన మరణాన్ని స్మరించుకుంటారు. కోరికలను అణచుకుంటూ, పాపాల నుంచి క్షమాపణ కోరుకుంటూ ప్రార్థన, ప్రాయశ్చిత్తం కోసం క్రైస్తవులు నలభై రోజులపాటు భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఉపవాస దీక్షలు శుభ శుక్రవారం సందర్భంగా ముగిస్తారు. నేడు గుడ్ ఫ్రైడే జరుపుకునేందుకు జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చర్చిలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు క్రీస్తు సందేశాన్ని వివరించనున్నారు.

**31న ఈస్టర్ పండుగ**

గుడ్ ఫ్రైడే రోజు శిలువపై అసువులు బాసిన క్రీస్తు మూడో రోజు తెల్లవారుజామున సమాధి నుంచి దర్శనమిచ్చాడని క్రైస్తవులు విశ్వసిస్తారు. దీనినే క్రైస్తవులు ఈస్టర్ (పునరుత్థాన పండుగ)గా జరుపుకుంటారు. ఈస్టర్ జరుపుకునేందుకు ఆదివారం తెల్లవారుజామున చర్చిల్లో శిలువను ఏర్పాటు చేయనున్నారు. చుట్టూ క్యాండిల్స్ వెలిగించి ప్రత్యేక గీతాలతో ఆరాధిస్తూ ప్రార్థన చేయనున్నారు. నూతన వస్త్రాలు ధరించి, ప్రత్యేక వంటకాలు తయారు చేసుకోనున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

**అందరూ ఆచరించదగినవి..**



జీవనయానంలో తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలని, సంతానం పట్ల దయాగుణం, సన్మార్గంలో జీవిస్తూ చీకట్లో ఉన్న వారికి చేయూతనివ్వాలంటూ క్రీస్తు సందేశమిచ్చారు. ఇవి అందరూ ఆచరించదగినవి.

–దేవిడ్‌రాజు, పాస్టోరేట్ చైర్మన్, మామిడిగూడెం, ఇల్లెందు మండలం

**నలభై రోజులూ ధ్యానంలోనే..**



గుడ్‌ఫ్రైడే సందర్భంగా నలభై రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరించాం. అనుక్షణం క్రీస్తును ధ్యానించాం. యేసయ్య శిలువ ద్వారా మానవాళికి ఇచ్చిన సందేశం నేటి సమాజంలోని ప్రతి మనిషికి మార్గదర్శనం చేస్తుంది.

– తోకల ఇమ్మానియేలు, చెక్‌పోస్టు రొంపేడు, ఇల్లెందు మండలం

## రుణం పేరుతో మోసగించిన ఇద్దరి అరెస్టు

- మరో ముగ్గురిపై కొనసాగుతున్న విచారణ
- హవాలా రూపంలో చేతులు మారిన రూ.కోట్ల నగదు
- డబ్బు ఆశతో ఏజెంట్లుగా మారిన నిందితులు
- చాకచక్యంగా కేసును ఛేదించిన ఇల్లెందు పోలీసులు

ఇల్లెందురూరల్: రుణం పేరుతో అమాయకులను బుట్టలో వేసుకుని.. వారి పేరిట బ్యాంకు అకౌంట్లు తెరిచి, హవాలా రూపంలో రూ.కోట్లు కాజేసిన ఇద్దరిని ఇల్లెందు పోలీసులు అరెస్ట్ చేశారు. ఇల్లెందుకు చెందిన ఐదుగురు మహిళల పేరుతో ఖాతాలు తెరిచిన ముఠా వారి అకౌంట్ల ద్వారా రూ.కోట్లలో లావాదేవీలు జరపడం, ఆ తర్వాత నిలిపివేయడాన్ని గమనించిన బ్యాంకు అధికారులు సదరు మహిళలను విచారించడంతో విషయం బయటపడింది. ఈ అంశంపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించగా రంగంలోకి దిగిన అధికారులు విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

**మోసం ఇలా..**

దుబాయ్‌లో నివాసం ఉంటున్న సుధాకర్, అశోక్ గుప్తా.. ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడుకు చెందిన కస్యా చిన్నబాబు అలియాస్ హర్షకు ఫోన్ చేసి ట్రేడింగ్ చేయడానికి కరెంట్ బ్యాంకు ఖాతా కావాలని చెప్పారు. ఈ ఖాతా తెరిస్తే రూ.50వేలు ఇస్తామని చెప్పడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖమ్మం గాంధీచౌక్ శాఖలో లోన్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న హర్ష డబ్బుకు ఆశపడి తన భార్య ప్రియాంక పేరిట ఖాతా తెరిచాడు. ఆతర్వాత దుబాయ్‌లో ఉంటున్న వ్యక్తులు మళ్లీ ఫోన్ చేయడంతో ఇల్లెందు వాస్తవ్యురాలైన తన భార్య స్నేహితుడైన చైతన్య అనే వ్యక్తికి డబ్బు ఆశ చూపాడు. దీంతో ఆయన పొదుపు సంఘాల మహిళలు ఐదుగురికి రూ.15వేలు రుణం ఇప్పిస్తానంటూ ఖాతాలు తెరిపించి వివరాలను దుబాయ్‌లో ఉన్నవారికి పంపించాడు. అందుకుగాను చైతన్యకు రూ.లక్ష నగదు ఇవ్వగా.. ఆయన ఐదుగురు మహిళలకు రూ.15వేల చొప్పున ఇచ్చి మిగతా రూ.25వేలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఐదు ఖాతాల ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఏటీఎం కార్డు వివరాలను దుబాయిలో ఉన్న సుధాకర్, అశోక్ హవాలా రూపంలో లావాదేవీలను కొనసాగించారు. ఇలా రూ.3.80కోట్ల మేర లావాదేవీలు జరిగాయి.

**చాకచక్యంగా ఛేదించిన పోలీసులు**

పెద్దమొత్తంలో నగదు లావాదేవీలపై అందిన ఫిర్యాదుతో ఇల్లెందు పోలీసులు విచారణ చేపట్టగా.. దుబాయి కేంద్రంగా దందా నడిపిస్తున్న సుధాకర్, అశోక్ బండారం బయటపడింది. ఇండియాలోని పలువురు వ్యాపారులను వాట్సాప్ గ్రూపు ద్వారా పరిచయం చేసుకుని క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ల పెట్టుబడి పెడితే చాలా రెట్లు కలిసొస్తాయని నమ్మబలుకుతూ ముందుకొచ్చిన వారి నుంచి మహిళల ఖాతాల్లో నగదు జమ చేయించారు. అనంతరం ఆ నగదును దుబాయ్‌కి బదిలీ చేసుకుని అక్కడ విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. గతంలో ఇదే తరహాలో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడిన వారిపై హైదరాబాద్ ఎల్బీనగర్ పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదైనట్లుగా తేలింది. ఈ మేరకు నిందితుల్లో చైతన్య, హర్షను ఇల్లెందు సీఐ కరుణాకర్ నేతృత్వాన అరెస్టు చేసినట్లు భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ వివరించారు. మిగిలిన వారిపై కూడా విచారణ సాగుతున్నట్లు తెలిపారు.

## 340 మంది మహిళలు.. 3 గంటల సహస్రగళార్చన


అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

పాల్వంచరూరల్: సామూహిక సహస్రగళార్చనతో పలువురు మహిళలు అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నారు. పెద్దమ్మ తల్లి దేవస్థానం సముదాయంలో గురువారం జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 340మంది మహిళలు 3 గంటలపాటు సామూహిక సహస్ర పారాయణం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బేరలక్ష్మి ఆధ్వర్యంలో, అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ ఇండియా కోఆర్డినేటర్ జ్యోతి రంగ సమక్షంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొండూరు పద్మావతి, బచ్చు హరీష, కొణిజర్ల కవిత, కొప్పరపు నాగేశ్వరి, కొత్తగుండ్ల తేజ, గడల కళ్యాణి, రంగా సుష్మా, కొప్పరపు సునీత, వారణాసి ధనలక్ష్మి, కె.శ్వేత, చందా శ్రీదేవి, గగ్రే వీరపారిజాతం, చండూరు శ్రీలక్ష్మి, పసుమర్తి నిర్మలతోపాటు ఖమ్మం, కొత్తగూడెం, సారపాక, దమ్మపేట, అశ్వారావుపేట, విస్సన్నపేట ప్రాంతాల నుంచి పలువురు మహిళలు హాజరయ్యారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బేరలక్ష్మిని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు శాలువతో ఘనంగా సత్కరించారు.

## ఎన్డీ దళ నేతపై నజర్?

- లొంగిపోవాలని ఒత్తిడి చేస్తున్న పోలీసులు..?

ఇల్లెందు: ఖమ్మం– వరంగల్ జిల్లాల సరిహద్దులో సంచరిస్తున్న ఎన్డీ దళ నేత, జిల్లా కార్యదర్శి, ఇల్లెందు మండలం మర్రిగూడెం – ఎల్లాపురం గ్రామానికి చెందిన పూనెం బాబు అలియాస్ రమేష్ మీద పోలీసులు నజర్ పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. ఇటీవల ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, గోపి, పుల్లన్నలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో వారి నుంచి తప్పించుకున్న ఐదుగురు ఎన్డీ సభ్యులతో పాటు రమేష్‌ను కూడా లొంగిపోవాలని ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది. రెండు ఎన్డీ గ్రూపులకు ఆరుగురు సభ్యులు అజ్ఞాతంలో సంచరిస్తున్నట్లు పసిగట్టిన మహబూబాబాద్, కొత్తగూడెం పోలీసులు.. ఈ వేసవి నాటికి లొంగిపోవాలని ఒత్తిడి తీవ్రతరం చేశారని ఆ పార్టీల నేతలే పేర్కొంటున్నారు. ఖమ్మం జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, గోపి, పుల్లన్నలు గురువారం ఇల్లెందు కోర్టుకు రాగా, ఎన్డీ నేతలు సాధినేని వెంకటేశ్వరరావు, చిట్టిపాటి వెంకటేశ్వరరావు, గౌని ఐలయ్య, ఆవునూరి మధు, తుపాకుల నాగేశ్వరరావు తదితరులు వచ్చి వారిని పరామర్శించారు.

## 'అధికార' ముసుగులో ఇసుక దోపిడీ

- ఎమ్మెల్యే పీఏ నంటూ దమ్మపేట నాయకుడి హుకుం!
- పోలీస్, రెవెన్యూ ఉద్యోగులను మేనేజ్ చేశామంటూ ప్రచారం


నిలిపివేసిన ఇసుక ట్రాక్టర్

అశ్వారావుపేట: అధికార పార్టీ ముసుగులో దమ్మపేటకు చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు ఇసుక అక్రమ రవాణాకు తెరతీశాడు. మండలంలోని గుర్రాలచెరువు వాగు నుంచి ఇసుక అక్రమంగా దమ్మపేటకు రవాణా చేస్తుండగా, వ్యవసాయ భూమి పాడవుతోందని రైతు అడ్డుకోవడంతో గురువారం ఈ విషయం బయటపడింది. గుర్రాలచెరువు, మొద్దులగూడెం గ్రామాల మధ్య ఉన్న వాగు నుంచి దమ్మపేట అక్రమార్కులు ఇసుక తరలిస్తున్నారు. స్థానిక అవసరాలకు వాగుల్లో ఇసుకను ప్రభుత్వం మన ఇసుక వాహనం ద్వారా సరఫరా చేస్తున్నా, తక్కువ ధరకు నాణ్యత లేని ఇసుక లభిస్తుండటంతో భవన నిర్మాణదారులకు అంటగడుతున్నారు. వాగు ప్రవాహం ఎండిపోవడంతో ఇసుకలో నాణ్యత కూడా లేదు. అయినా మార్గమధ్యలో వ్యవసాయ బోరుతో ఇసుకను తడిపి వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. కాగా 'ఏం అభివృద్ధి పనులు చేయవద్దా.. సీసీ రహదారులు నిర్మించవద్దా..? ఎమ్మెల్యే పీఏని, ఎమ్మార్వో, సీఐ, ఎస్‌ఐలకు చెప్పాం. ఇసుక పంపించండి'అంటూ ఓ కాంగ్రెస్ నాయకుడు సదరు రైతుకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. అతను ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఓ నాయకుడని తెలిసింది. ఈ విషయాన్ని అశ్వారావుపేట తహసీల్దార్ కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా.. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఎమ్మెల్యే, ఆయన పీఏ, అనుచరులు ఎవరూ ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురాలేదని, ఇసుక రవాణాపై విచారణ జరిపిస్తామని తెలిపారు.

## స్వతంత్ర సంఘంగా టీబీజీకేఎస్?

- బీఆర్‌ఎస్‌తో తెగిపోతున్న రెండు దశాబ్దాల బంధం!
- పార్లమెంట్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం

మణుగూరు టౌన్: బీఆర్‌ఎస్‌కు, ఆ పార్టీ అనుబంధ కార్మిక విభాగం టీబీజీకేఎస్‌కు బంధం తెగిపోతోందనే ప్రచారం సాగుతోంది. ఏ రాజకీయ పార్టీ అనుబంధం లేకుండా, స్వతంత్రంగా ముందుకు సాగాలని ఆ సంఘ నేతలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) 2003లో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేతుల మీదుగా ఆవిర్భవించింది. 2012, 2017లో రెండుసార్లు సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘంగా ఎన్నికైంది. దాదాపు పదేళ్లపాటు గనుల్లో హవా కొనసాగించింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి చెందగా, అనంతరం సింగరేణి ఎన్నికల్లోనూ టీబీజీకేఎస్ ఓడిపోయింది. సంఘం గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట కవిత ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్ట్ అయ్యారు. కాగా తాజాగా టీబీజీకేఎస్ బీఆర్‌ఎస్‌తో తెగదెంపులు చేసుకుంటుందనే ప్రచారం జోరందుకుంది. అయితే గుర్తింపు సంఘం ఎన్నికల్లో మణుగూరు ఏరియాలో మాత్రం మిగతా యూనియన్లకు గట్టి పోటీనిచ్చింది. ఇక్కడ టీబీజీకేఎస్‌కు 2 వేల సభ్యత్వం ఉంది.

**పార్లమెంట్ ఎన్నికలపై ప్రభావం..**

బీఆర్‌ఎస్‌తో టీబీజీకేఎస్ అనుబంధం తెగిపోతే పార్లమెంట్ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మణుగూరు ఏరియా మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉండగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎంపీ మాలోత్ కవితకు మద్దతిస్తారో లేదోననే చర్చ జోరుగా సాగుతోంది. స్వతంత్ర సంఘంగా మారితే బీఆర్‌ఎస్ అభ్యర్థి కవిత గెలుపుపై ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## మాజీ ఎమ్మెల్యే రేగా సహాయకుడి అరెస్ట్

మణుగూరు టౌన్: పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సహాయకుడిని గురువారం జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారనే సమాచారం మణుగూరు సోషల్‌మీడియా గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. కాగా రేగా కాంతారావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో హైదరాబాద్‌లో తన సహాయకుడిగా పనిచేసిన కొర్లపాటి వంశీ వేరొకరి పేరిట మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును డ్రా చేసుకున్నాడని అభియోగంతో అరెస్ట్ అయినట్లు తెలుస్తోంది. కాగా సీఎంఆర్‌ఎఫ్ అవకతవకల్లో అరెస్టయిన వారిలో తన పీఏలు ఎవరూ లేరని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సామాజిక మాధ్యమం వేదికగా ప్రకటన చేశారు.

## సీపీఆర్‌పై సింగరేణి వైద్యులకు శిక్షణ


అత్యవసర చికిత్సపై అవగాహన కల్పిస్తున్న ఈఎంఆర్‌ఐ వైద్యులు

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌కు చెందిన జీవీకే ఫౌండేషన్, ఈఎంఆర్‌ఐ ఆధ్వర్యాన సింగరేణి పరిధిలోని వైద్యులు, సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు ఏరియాల వైద్యులు, సిబ్బందికి కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో రెండు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా కార్పొరేట్ హెచ్‌ఆర్‌డీ జీఎం బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సింగరేణి సీఎండీ బలరామ్ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల వైద్యులు, సిబ్బందికి అత్యవసర సమయాల్లో చేయాల్సిన సీపీఆర్‌పై అవగాహన శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సీఎంఓ సుజాత, అధికారులు విక్టర్ వందనం, మట్రోన్ మిస్ శాలే, రవీన్, జావీద్, సతీష్, మధుసూదన్ పాల్గొన్నారు.

## దగాకోరు ఎన్నికలు బహిష్కరించండి

మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు

చర్ల: అధికార పార్టీలతో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా ప్రజలను మళ్లీ మోసం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నందున దగాకోరు పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం పత్రికలకు లేఖ విడుదల చేసింది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తుండగా, ఆయా పార్టీల నాయకులు మరోమారు ప్రజలను మోసం చేసి, గెలిచేందుకు సిద్ధమవుతున్నాయని పేర్కొంది. గత ఏడాది నవంబర్‌లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలన్నీ రూ.వేల కోట్ల నగదు, మద్యం పంచిపెట్టాయని, ఇప్పుడూ అదే తరహాలో అధికారాన్ని చేపట్టడానికి ధనబలం, కండబలం, మద్యం, కులం, మతం పేర్లతో వస్తున్నాయని వెల్లడించింది. దళారీ, నిరంకుశ, పెట్టుబడిదారీ, భూస్వామ్య, పాలకవర్గ ముఠాలు కుల, మతతత్వ, ప్రాంతీయ రాజకీయాలతో భ్రష్టు పట్టిస్తున్నాయని, పార్లమెంట్ వ్యవస్థను మరోసారి అపహాస్యం చేయడానికి సిద్ధమవుతున్నాయని పార్టీ ఆరోపించింది. దళారీ నిరంకుశత్వాన్ని చట్టబద్ధం చేసి, దానిని పటిష్టం చేయాలనే లక్ష్యంతో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తున్నారని వెల్లడించింది. 2019 లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీ కుట్ర పూరితంగా పుల్వామా ఘటనను సృష్టించి హిందూ మతోన్మాదం, జాతీయోన్మాదం, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి ఓట్లు దండుకుందని.. ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఇప్పుడు అయోధ్యలో రెండు మతాల ప్రజల మధ్య చిచ్చు రేపి రామ మందిరాన్ని రూ.2వేల కోట్లతో నిర్మించి రాజ్యాంగ విరుద్ధంగా, నిరంకుశత్వంగా ప్రభుత్వ లాంఛనాలతో ప్రారంభించి రాజకీయం చేసిన విషయం ప్రజలందరికీ తెలిసిన విషయమేనని పార్టీ బాధ్యులు ఆ లేఖలో పేర్కొన్నారు.

## పంట దిగుబడి రాక..

- మనోవేదనతో పురుగుల మందు తాగిన రైతు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


శశికుమార్(ఫైల్)

పాల్వంచరూరల్: అప్పులు చేసి పంటలపై పెట్టిన పెట్టుబడి రాక నష్టపోయిన యువ రైతు పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల పరిధి యానంబైల్ గ్రామానికి చెందిన మంత్రి శశికుమార్(26) ఈ నెల 26న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు.

**రూ. 4 లక్షల అప్పు**

శశికుమార్ యానంబైల్ గ్రామంలో మూడెకరాల్లో మొక్కజొన్న, ఎకరంలో వరిపొలం రెడ్డిగూడెం సమీపంలో మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. పెట్టుబడి కోసం సుమారు రూ. 4 లక్షల వరకు అప్పు చేశాడు. మొక్కజొన్న, వరి పంట ఎండిపోయి దిగుబడి రాలేదు. దీంతో తీవ్రంగా నష్టపోయి, అప్పు ఎలా తీర్చాలనే మనోవేదనతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

## ఉరి వేసుకొని ఆటోడ్రైవర్ ఆత్మహత్య

చుంచుపల్లి: మండలంలోని బాబుక్యాంప్ వ్యాయామశాల ఎదురుగా నివాసం ఉంటున్న ఓ ఆటో డ్రైవర్ ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడగా.. గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మనోహర్ (45) ఉరివేసుకొని చనిపోయాడు. అతడు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండగా.. ఆర్థిక ఇబ్బందులే కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మనోహర్ ఉరి వేసుకోగా.. మూడు రోజులుగా తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కల ప్రజలకు ఆ ఇంట్లో నుంచి దుర్వాసన వెదజల్లడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా మనోహర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాక్టర్ కిందపడి రైతు మృతి

మధిరరూరల్: పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడిన రైతు మృతి చెందాడు. వివరాలు... మధిర మండలం నిధానపురానికి చెందిన రైతు అమరవాది నర్సిరెడ్డి (58) ఐదెకరాల భూమి కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశాడు. పంట పూర్తి కావడంతో పొలంలో మిరప కట్టె తొలగించేందుకు తన ట్రాక్టర్‌కు రోటవేటర్ బిగించుకుని వెళ్లాడు. ఈక్రమంలోనే రోటవేటర్‌లో ఇరుక్కున్న మిరప కట్టె తొలగించే క్రమాన ప్రమాదవశాత్తు రోటవేటర్ కింద పడ్డాడు. సమీపంలో ఉన్న రైతులు గమనించి చేరుకునే సరికి నర్సిరెడ్డి తల ముక్కలైమృతి చెంది ఉన్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా.. ఘటనపై మధిర రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## రిటైర్మెంట్ తర్వాత ఎన్నికల విధులకు ఆదేశాలు!

ఈ నెల 31న ఉద్యోగ విరమణ.. మే 13న ఎన్నికల విధులు

అశ్వారావుపేట: మార్చి 31న ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయుడికి ఏప్రిల్ 1న ట్రెనింగ్, మే 13న పోలింగ్ విధులు కేటాయిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అశ్వారావుపేట మండలం పాకలగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాల (జీపీఎస్)లో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.నాగేశ్వరరావు ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందనుండగా, సున్నంబట్టి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం పే సెంటర్ హెచ్‌ఎంగా వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 29న పే సెంటర్ సున్నంబట్టి హెచ్‌ఎం ప్రతిపాదనలు, దమ్మపేట మండలం చీపురుగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం పేర్కొన్న లెటర్‌లో ఉపాధ్యాయుడు ఎస్.నాగేశ్వరరావుకు 61ఏళ్లు నిండిన ఆధారంగా రిటైర్మెంట్‌కు అర్హులని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనల మేరకు ఐటీడీఏ డీడీ పి.మణెమ్మ ఈ నెల 15న ఆర్‌సీ నంబరు ఏ4/డీడీ(టీడబ్ల్యూ) / 242 / 2024 తో రిటైర్మెంట్‌కు నోటీసు జారీ చేశారు. కాగా ఈ నెల 27న కలెక్టర్ ప్రియాంక ఆల ఎన్నికల విధులు కేటాయిస్తూ జిల్లాలోని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగ విరమణ పొందాక కూడా ఎన్నికల విధులకు హాజరుకావాలా అనే విషయమై దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్ దృష్టికి తీసుకువెళ్లగా.. సెంటర్ హెచ్‌ఎంలు పంపించిన వివరాలను యథాతథంగా డీడీ కార్యాలయానికి పంపించామని తెలిపారు.

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 655 | 73,651 |
| నిఫ్టీ ▲ | 203 | 22,327 |

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 16,381 | ▼ | 19 |
| డోజోన్స్ | 39,765 | ▲ | 4 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,953 | ▲ | 21 |
| డాక్స్ | 18,492 | ▲ | 15 |
| షాంఘై | 3,110 | ▲ | 18 |
| నికాయ్ | 40,168 | ▼ | 595 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## బులియన్ (రూ.లలో)

| ముంబై | | | |
|---|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 66,760 | ▲ | 126 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 66,691 | ▲ | 125 |
| వెండి (కిలో) | 74,747 | ▲ | 250 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 82.93 | 83395 |
| £ | బ్రిటన్ పౌండ్ | 104.32 | 106.84 |
| € | యూరో | 89.25 | 90.68 |
| ¥ | జపాన్ ఎన్ (100) | 55.34 | 56.14 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | 53.54 | 55.75 |
| S$ | సింగపూర్ డాలర్ | 59.34 | 64.75 |
| SAR | సౌదీ రియాల్ | 21.28 | 22.85 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 21.69 | 23.55 |
| ¥ | చైనా యువాన్ | 10.40 | 12.47 |

# చేతులు కలిపిన అంబానీ- అదానీ

### అదానీ పవర్ ప్రాజెక్టులో రిలయన్స్‌కు 26 శాతం వాటా



న్యూఢిల్లీ: బిలియనీర్ పారిశ్రామిక దిగ్గజాలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ తొలిసారి చేతులు కలిపారు. దీనిలో భాగంగా అదానీ పవర్‌కు చెందిన పవర్ ప్రాజెక్టులో రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) 26 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. అంతేకాకుండా మధ్యప్రదేశ్‌లోని ఈ ప్లాంటుకు చెందిన 500 మెగావాట్ల యూనిట్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఆర్ఐఎల్ సొంత అవసరాలకు వినియోగించుకునేందుకు రెండు సంస్థలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. వెరసి అదానీ పవర్ పూర్తి అనుబంధ సంస్థ మహాన్ ఎనర్జెన్ లిమిటెడ్‌లో 5 కోట్ల ఈక్విటీ షేర్లను ఆర్ఐఎల్ సొంతం చేసుకోనుంది. రూ. 10 ముఖ విలువకే(రూ. 50 కోట్లు) వీటిని చేజిక్కించుకోవడంతోపాటు.. 500 మెగావాట్ల విద్యుత్‌ను సొంత అవసరాలకు ఆర్ఐఎల్ వినియోగించుకోనుంది. సొంత వినియోగ పాలసీలో భాగంగా ఆర్ఐఎల్ 20 ఏళ్ల దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని(పీపీఏ) ఎంఈఎల్‌తో కుదుర్చుకున్నట్లు అదానీ పవర్ వెల్లడించింది. మొత్తం 2,800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఎంఈఎల్ ప్లాంటులో 600 మెగావాట్ల యూనిట్‌ను సొంత అవసరాల పద్ధతిలో తెరతీయనున్నట్లు వివరించింది.

## అదానీ గ్రూప్ ప్రపంచ అతిపెద్ద కాపర్ ప్లాంట్

గుజరాత్‌లోని ముంద్రాలో అదానీ గ్రూప్ భారీ కాపర్ ప్లాంటు తొలి దశను ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే సింగిల్ లొకేషన్‌లో ఏర్పాటైన అతి పెద్ద కాపర్ తయారీ కర్మాగారంగా నిలవనుంది. దీనితో దిగుమతులపై ఆధారపడే పరిస్థితి కొంత తగ్గనుంది.

## అంబుజాలో అదానీ వాటా అప్

### రూ. 6,661 కోట్ల పెట్టుబడులు

డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా అంబుజా సిమెంట్స్‌లో వాటాను పెంచుకుంది. 21.2 కోట్ల వారంట్లను ఈక్విటీ షేర్లుగా మార్పిడి చేసుకోవడం ద్వారా 3.6 శాతం అదనపు వాటాను పొందింది. ఇందుకు రూ. 6,661 కోట్లు వెచ్చించగా.. ప్రస్తుతం అంబుజాలో అదానీ వాటా 66.7 శాతానికి చేరింది. దేశీయంగా సిమెంట్ తయారీలో రెండో పెద్ద కంపెనీగా నిలుస్తున్న అంబుజాలో ప్రమోటర్ సంస్థ హార్మోనియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ షేరుకి రూ. 314.15 సగటు ధరలో వారంట్లను మార్పిడి చేసుకుంది. ఇంతక్రితం 2022 అక్టోబర్‌లోనూ ప్రమోటర్ సంస్థ వారంట్లను అందుకోవడం ద్వారా రూ. 5,000 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా హార్మోనియాకు 47.74 కోట్ల మార్పిడికి వీలయ్యే వారంట్లను అంబుజా సిమెంట్స్ జారీ చేసింది.

## చిన్న పొదుపులపై వడ్డీరేట్లు యథాతథం



న్యూఢిల్లీ: చిన్న పొదుపులపై వడ్డీరేట్లు ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో జనవరి–మార్చి తరహాలోనే యథాతథంగా కొనసాగనున్నాయి. వీటిలో ఎటువంటి మార్పూ ఉండబోదని కేంద్రం ప్రకటించింది. ప్రకటన ప్రకారం సుకన్య సమృద్ధి యోజనపై 8.2% వడ్డీరేటు అమలవుతుంది. మూడేళ్ల టర్మ్ డిపాజిట్‌పై వడ్డీ రేటు 7.1%. పీపీఎఫ్‌పై వడ్డీ 7.1 శాతంకాగా, పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్ స్కీమ్‌పై 4% వడ్డీ అమలవుతుంది. కిసాన్ వికాస పత్రాపై 7.5% వడ్డీ లభిస్తుంది. ఇన్వెస్ట్‌మెంట్ మెచ్యూరిటీ కాలం 115 నెలలు. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై వడ్డీ 7.7%. నెలవారీ ఆదాయ పథకంపై 7.4% వడ్డీ లభిస్తుంది.

## ఫిబ్రవరిలో మౌలికం నెమ్మది



న్యూఢిల్లీ: ఎనిమిది కీలక పరిశ్రమలతో కూడిన భారత్ మౌలిక రంగం ఫిబ్రవరిలో 6.7 శాతం పురోగమించింది. 2023 ఇదే నెల్లో ఈ వృద్ధి రేటు 7.4 శాతం. అయితే జనవరితో పోల్చితే (4.1 శాతం) గ్రూప్ పురోగమించడం గమనార్హం. సమీక్షా నెల్లో ఎరువుల రంగంలో వృద్ధిలేకపోగా, క్షీణ రేటు నమోదయ్యింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ పురోగతి గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే 8.2% నుంచి 7.7 శాతానికి తగ్గింది. ఎరువులుసహా బొగ్గు, క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, స్టీల్, సిమెంట్, ఎలక్ట్రిసిటీ రంగాలు ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తిలో వీటి వెయిటేజ్ 42 శాతం.

## కొటక్ బ్యాంక్ చేతికి సొనాటా ఫైనాన్స్

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం కొటక్ మహీంద్రా బ్యాంక్ తాజాగా ఎన్‌బీఎఫ్‌సీ.. సొనాటా ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 537 కోట్లు వెచ్చించింది. 549 బ్రాంచీల ద్వారా సొనాటా 10 రాష్ట్రాలలో కార్యకలాపాలు విస్తరించింది. ఆర్‌బీఐ రిజిస్టర్డ్ మైక్రోఫైనాన్స్ సంస్థ సొనాటా నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) సుమారు రూ. 2,620 కోట్లు కాగా.. 100 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు కొటక్ బ్యాంక్ పేర్కొంది. దీంతో సొనాటా పూర్తి అనుబంధ సంస్థగా ఆవిర్భవించినట్లు వెల్లడించింది.

ఈ వార్తల నేపథ్యంలో కొటక్ బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 0.6 శాతం బలపడి రూ. 1,786 వద్ద ముగిసింది.

### ఆర్థిక సంవత్సరానికి

# లాభాలతో గుడ్ బై...

- సెన్సెక్స్ 655 పాయింట్లు ప్లస్
- 22,250 స్థాయి పైకి నిఫ్టీ
- గుడ్‌ఫ్రైడే సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు

- సెన్సెక్స్ 30 షేర్లలో యాక్సిస్ బ్యాంక్ (0.50%), రిలయన్స్ (0.37%), హెచ్‌సీఎల్ (0.26%), టెక్ మహీంద్రా (0.25%) మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 26 షేర్లూ లాభపడ్డాయి.
- బీఎస్‌ఈ, నిఫ్టీలు ఎంపిక చేసుకున్న షేర్లలో బీటా వెర్షన్ టీ+0 ట్రేడ్ సెటిల్‌మెంట్‌ను ప్రారంభించాయి. తొలి రోజున రెండు ఎక్స్ఛేంజీల్లో 60 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

ముంబై: ఆర్థిక సంవత్సరం చివరి రోజైన గురువారం స్టాక్ సూచీలు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 655 పాయింట్లు పెరిగి 73,651 వద్ద ముగిసింది. నిఫ్టీ 203 పాయింట్లు బలపడి 22,327 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి మీడియా మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 1,194 పాయింట్లు పెరిగి 74,190 వద్ద, నిఫ్టీ 392 పాయింట్లు బలపడి 22,516 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. స్టాక్ మార్కెట్ సంబంధించి ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో పాటు ఫారెక్స్ మార్కెట్లో బలహీనతల కారణంగా ఆఖర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో సూచీలు కొంతమేర ఆరంభ లాభాలు కోల్పోయాయి. సెన్సెక్స్ దాదాపు ఒకశాతం లాభపడటంతో బీఎస్‌ఈలో రూ.3.33 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.


నేడు ఎక్ఛేంజీలకు గుడ్‌ఫ్రైడే సెలవు. శని, ఆదివారాలు సాధారణ సెలవులు రోజులు కావడంతో ట్రేడింగ్ సోమవారం ప్రారంభం అవుతుంది.

### ర్యాలీ ఎందుకంటే

ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్ల(ఏఐఎఫ్)లో రుణదాతల పెట్టుబడులపై గతంలో కఠిన ఆంక్షలు విధించిన ఆర్‌బీఐ తాజాగా నిబంధనలను సులభతరం చేయడంతో అధిక వెయిటేజీ ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులతో పాటు ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. మోర్గాన్ స్టాన్లీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ భారత వృద్ధి అవుట్‌లుక్‌ను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి అప్‌గ్రేడ్ చేసింది. ఇటీవల ఎఫ్ఐఐలు భారత ఈక్విటీల పట్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. అమెరికా సూచీలు రికార్డు స్థాయిల్లో ట్రేడవుతున్నాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు 0.5% పెరిగాయి.

### 2023- 24లో రూ.128 లక్షల కోట్ల సృష్టి

దేశీయ స్టాక్ మార్కెట్ 2023–24లో గణనీయమైన లాభాలు పంచింది. సెన్సెక్స్ 14,660 పాయింట్లు (25%) ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం విలువ ఏడాది వ్యవధిలో 128 లక్షల కోట్లు పెరిగి రూ.387 లక్షల కోట్లు చేరింది. సెన్సెక్స్ మార్చి 7న 74,245 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. మార్చి 2న ఇన్వెస్టర్ల సంపద సైతం రూ.394 లక్షల వద్ద ఆల్‌టైం హైని తాకింది. ఇదే కాలంలో నిఫ్టీ 4,967 పాయింట్లు(29%) పెరిగింది. మార్చి 11న 22,526 వద్ద చరిత్రాత్మక గరిష్టాన్ని అందుకుంది. 2022-23లో 423 పాయింట్లు పెరిగినప్పటికీ ఇన్వెస్టర్లకు రూ. 5.86 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది.



## ఐసీఐసీఐ సెక్యూరిటీస్ డీలిస్టింగ్

స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి డీలిస్ట్ చేసేందుకు 72 శాతం వాటాదారులు అనుమతించినట్లు ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తాజాగా వెల్లడించింది. అయితే రిటైల్ ఇన్వెస్టర్లు ఈ పథకాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. డీలిస్టింగ్ తదుపరి మాతృ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్‌లో విలీనంకానున్నట్లు తెలియజేసింది. డీలిస్టింగ్ పథకంలో భాగంగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్ వాటాదారులు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 67 ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లను పొందనున్నట్లు వెల్లడించింది.

## కార్వీకి సెబీ మరో షాక్

కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ లిమిటెడ్‌కు సెబీ మరో షాక్ ఇచ్చింది. అర్హత ప్రమాణాలను ఉల్లంఘించినందుకు మర్చంట్ బ్యాంకర్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. 2023 మార్చి 15–17 తేదీల్లో కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్‌ను సెబీ బృందం తనిఖీల నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకుంది. గతంలోనూ సెబీ కార్వీపై పలు చర్యలు తీసుకున్న సంగతి విదితమే.

## కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 29-3-2024 | |
|---|---|
| విశాఖ | 415-00 |
| చిత్తూరు | 458-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 400-00 |
| విజయవాడ | 400-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **29-3-2024 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 375-00 |
| వరంగల్ | 377-00 |
| రిటైల్ ధర | 4.35 |

## టయోటా వాహనాలు కాస్త ప్రియం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టయోటా మోటార్ ఎంపిక చేసిన మోడళ్లపై 1 శాతం వరకు ధరలు పెంచనుంది. ఏప్రిల్ 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి రానున్నాయని కంపెనీ గురువారం ప్రకటించింది. తయారీ, నిర్వహణ వ్యయాలు అధికం అవుతున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. టయోటా తయారు చేస్తున్న మోడళ్ల ధర ఎక్స్‌షోరూంలో రూ.6.86 లక్షలు మొదలుకుని రూ.51.44 లక్షల వరకు ఉంది.

## భారత్‌లో ఐఏఐ అనుబంధ సంస్థ ఏర్పాటు



న్యూఢిల్లీ: ఏరోస్పేస్, రక్షణ రంగ దిగ్గజం ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) భారత్‌లో తమ అనుబంధ సంస్థ ఏరోస్పేస్ సర్వీసెస్ ఇండియా (ఏఎస్ఐ)ని ప్రారంభించింది. మేక్ ఇన్ ఇండియా లక్ష్య సాధనలో పాలుపంచుకోవడంపై తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని ఏఎస్ఐ సీఈవో డ్యానీ లాబర్ తెలిపారు. భారతీయ సాయుధ బలగాల కోసం అధునాతన సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసే దిశగా ఏఐఏ, డీఆర్‌డీవో మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఇది దోహదపడగలదని వివరించారు.

**జిల్లా వార్తలు**

## శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ ఉద్యోగి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భద్రాచలానికి చెందిన భక్తులు గురువారం విరాళం అందజేశారు. పట్టణంలోని తాతగుడి సెంటర్‌కు చెందిన గుండేల వెంకటేశ్వరరావు-రత్నకుమారి దంపతులు రూ.2 లక్షలను వితరణ చేయగా.. అధికారులు రశీదు అందజేసి స్వామి దర్శనం కల్పించారు. ఆలయ ఉద్యోగి ఎల్.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చెల్లింపుల్లో ఆలస్యం.. ఉద్యోగులను మోసం చేయడమే..



సమావేశంలో మాట్లాడుతున్న పాటి అప్పారావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు 2013 సంవత్సరం పేస్కేల్‌కు సంబంధించి 50 శాతం బాండ్ల నగదు చెల్లించేందుకు రూ.281 కోట్లు మంజూరు చేసినా కార్మికులకు డబ్బు అందడం లేదని టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పాటి అప్పారావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రీజియన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బాండ్ల నిధులు మంజూరు చేసి 40 రోజులు గడుస్తున్నా ఆర్టీసీ యాజమాన్యం చెల్లించకపోవడం సరికాదన్నారు. ఉద్యోగుల సీనియారిటీ ఆధారంగా ప్రకారం నగదు చెల్లిస్తామనడం ఉద్యోగులను మోసం చేయడమేనని.. ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘటిత పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రీజియన్ అధ్యక్షుడు గుడిబోయిన శ్రీనివాస్, ఖమ్మం డిపో అధ్యక్ష, కార్యదర్శులు దేశబోయిన జగన్నాథం, బేతంపూడి బుచ్చిబాబుతో పాటు గోపాల్ రావు, నాగుల్ మీరా, రఘురాం, రాంబాబు, ఆర్.నాగేంద్రసింగ్, కె.నాగభూషణరావు, మందా రాయప్ప, సుందరం, రమణారావు, మధు, పవన్ కుమార్, లాజర్, హరినాథ్‌బాబు, రమాదేవి, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తపాలా.. రోజంతా కళకళ!

- ఖమ్మం హెడ్డాఫీస్‌లో ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సేవలు
- రోజుకు రూ.1.50 కోట్లకు పైగానే లావాదేవీలు
- సేవలు వినియోగించుకుంటున్నది 1000 మందికి పైగానే..
- ఇక్కడే పాస్‌పోర్ట్, ఆధార్ సేవలు కూడా..



ఖమ్మం హెడ్ పోస్టాఫీస్‌లో వినియోగదారుల రద్దీ

ఖమ్మంగాంధీచౌక్: కొన్నేళ్ల క్రితం పోస్టాఫీస్ అంటే మనియార్డర్, లెటర్లు మాత్రమే గుర్తుకొచ్చేవి. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాంకింగ్ సేవలే కాక.. పాస్‌పోర్ట్, ఆధార్ సేవలను సైతం అందుబాటులోకి తీసుకురావడంతో అన్ని వర్గాల ప్రజలు పోస్టల్ శాఖకు చేరువవుతున్నారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే బ్రిటిష్ కాలం నుంచి ఉన్న ఖమ్మంలోని హెడ్డాఫీస్ నగరవాసులకే కాక ఉమ్మడి జిల్లా ప్రజలకు సుపరిచితం. పూర్వం ఈ కార్యాలయంలో ఖమ్మం డివిజన్ సూపరింటెండెంట్ కార్యాలయంతో పాటు హెడ్ పోస్టాఫీస్ కూడా నిర్వహించేవారు. ఆ తర్వాత ఖమ్మం గాంధీచౌక్‌లోకి డివిజన్ కార్యాలయాన్ని తరలించి ఇక్కడ హెడ్డాఫీస్ మాత్రమే నిర్వహిస్తున్నారు. తొలినాళ్లలో ఉత్తరాల బట్వాడా, టెలీగ్రామ్‌లు, మనియార్డర్లు, పరీక్ష పేపర్ల బట్వాడా మాత్రమే నిర్వహించగా.. కాలక్రమంలో అన్నివర్గాల ప్రజలకు అవసరమయ్యే అనేక రకాల సేవలను అందిస్తున్నారు.

### సగటున రూ.కోటికి పైగా లావాదేవీలు

ఖమ్మం హెడ్ పోస్టాఫీస్‌లో నిత్యం రూ.1.50 కోట్ల మేర లావాదేవీలు కొనసాగుతున్నాయి. పొదుపు పథకాలు, డిపాజిట్లు, పెన్షన్లు, ప్రభుత్వ పథకాలు, తపాలా జీవిత బీమా, మనియార్డర్లు, స్పీడ్ పోస్టులు, పార్సిళ్ల సేవలతో పాటు పాస్‌పోర్టు సేవలు,



ఆధార్ సేవలు అందిస్తున్న ఉద్యోగులు

ఆధార్ సేవలు, స్టాంపుల విక్రయాలు వంటి వాటి ద్వారా ఈ లావాదేవీలు నమోదవుతున్నాయి. వీటితో పాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు ప్రధాన కార్యాలయాన్నే ఆశ్రయిస్తున్నారు. ఇలా నిత్యం 1000 మందికి పైగా వినియోగదారులు ఇక్కడకు వస్తుండగా.. లావాదేవీలు రూ.కోటి దాటేశాయి.

### పాస్‌పోర్టు, ఆధార్ సేవలు

పాస్‌పోర్ట్ తీసుకునేందుకు ఖమ్మం వాసులు పడుతున్న ఇక్కట్లను గుర్తించి.. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో పాస్‌పోర్టు కార్యాలయం మంజూరు చేయించారు. తద్వారా ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల వాసులకు సేవలందుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ నిత్యం 90 స్లాట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే, ప్రభుత్వం ఆధార్ సేవలను సైతం తపాలా కార్యాలయాలకు అప్పగించగా.. నిత్యం వందలాది మంది సేవలు పొందుతున్నారు. కాగా, ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో సేవలకు అనుగుణంగా ఆ శాఖ ఉద్యోగులను కేటాయించింది. ఈ కార్యాలయంలో ప్రస్తుతం 38 మంది ఉద్యోగులకు గాను 32 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

### తెల్లవారే మొదలు...

నాలుగున్నర లక్షల జనాభా కలిగిన ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లా ప్రజల ప్రయోజనార్థం ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయం పనివేళలు నిర్దేశించారు. ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యాలయం పనిచేస్తుంది. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆర్థికేతర వ్యవహారాలకు సంబంధించిన సేవలందిస్తారు. ఇక ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆర్థిక, ఆర్థికేతర సేవలనూ అందిస్తున్నారు. అలాగే, రైల్వే పార్సిళ్లనూ తపాలా కార్యాలయం నుంచే పంపిస్తారు. ఖమ్మం రైల్వే తపాలా కార్యాలయం సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తోంది.

### హెడ్ పోస్టాఫీస్‌లో అన్నిరకాల సేవలు



పోస్టల్ పని అంటే ఖమ్మం హెడ్డాఫీసే గుర్తుకొస్తుంది. గతంలో ఉత్తరాలు, మనియార్డర్లు, టెలీగ్రామ్ వంటి సేవలే ఉండేవి. ఇటీవల ఆధార్ సేవలు, బ్యాంకింగ్ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటోంది.

– ఎ.వెంకటేశ్వర్లు, ప్రకాష్‌నగర్, ఖమ్మం

### ప్రభుత్వం నిర్దేశించిన సేవలన్నీ..



ప్రభుత్వం నిర్దేశించిన సేవలన్నీ ప్రజలకు అందిస్తున్నాం. ఖమ్మంతో పాటు పరిసర జిల్లాల ప్రజలు సేవలు వినియోగించుకుంటున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు, వ్యాపారులు, మహిళలు, కార్మికులు ఈ కార్యాలయానికి ఎక్కువగా వస్తారు.

– కె.కిరణ్‌కుమార్‌రెడ్డి, పోస్టుమాస్టర్, ఖమ్మం హెడ్ పోస్టాఫీస్

## డిగ్రీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఅర్బన్: ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఖమ్మంలో మహిళా డిగ్రీ కాలేజీ, కొత్తగూడెంలో పురుషుల డిగ్రీ కాలేజీ ఉండగా, ఆర్‌డీసీ సెట్-2024 ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు ఖమ్మం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వేంసాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఏప్రిల్ 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 28న ప్రవేశపరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచితంగా విద్య, భోజన వసతితో పాటు యూనిఫాం, నోట్, టెక్ట్స్ పుస్తకాలు అందుతాయని తెలిపారు. వివరాలకు రఘునాథపాలెంలోని ఎస్ఎస్‌మూర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో కొనసాగుతున్న మహిళా గురుకుల డిగ్రీ కళాశాల లేదా 98481 61319, 80194 22103 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## ఏజెన్సీలో అభివృద్ధి ఆగొద్దు

- ఏప్రిల్ 10నాటికి పనులన్నీ పూర్తి కావాలి
- ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



ఇంజనీరింగ్, ఐటీడీఏ అధికారులతో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యాన జరుగుతున్న ఇంజనీరింగ్ అభివృద్ధి పనులను నిలిచిపోకుండా వేగం పెంచి పూర్తిచేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం నుంచి ఖమ్మం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన పలు అంశాలపై సమీక్షించారు. పాఠశాలల మరమ్మతు కోసం ఇప్పటికే నిధులు కేటాయించిన నేపథ్యాన విద్యార్థులకు అవాంతరాలు ఎదురుకాకుండా పనులు చేపట్టాలని తెలిపారు. అనంతరం ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఈలు, ఏఈలతో సమావేశమైన పీఓ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన గ్రామాల్లో శ్మశాన వాటికలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలలే కాక గిరిజన గ్రామాల్లో డ్రెయినేజీలు, సబ్ సెంటర్ల మరమ్మతులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. ఇంకా పాఠశాలల మరమ్మతులపై ప్రతిపాదనలు సమర్పించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అదనపు గదుల నిర్మాణం చేపట్టి, ఫ్యాన్లు, లైట్లు, సమకూర్చాలని పీఓ తెలిపారు. తాగునీటి సమస్య ఉన్న చోట ఆర్వో ప్లాంట్ లేదా హ్యాండ్ బోర్ వేయించాలని సూచించారు. అన్ని పనులు ఏప్రిల్ 10 నాటికి పూర్తి చేసి బిల్లులు సమర్పించాలని తెలిపారు. ఈవిషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పీఓ హెచ్చరించారు. ఈ సమావేశాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ఎస్ఓ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేలైన్ల సర్వేలతో రైతన్నల ఆందోళన

- జిల్లాలోని నాలుగు మండలాల్లో మార్కింగ్
- రెండు రైల్వేలైన్ల నిర్మాణానికి ప్రతిపాదనల పేరిట ప్రచారం
- చకచకా సర్వే.. ఆపై పలుచోట్ల మార్కింగ్
- రైల్వేలైన్లు వస్తాయనే ప్రచారంతో భూముల ధరలపై ప్రభావం





రామచంద్రాపురం వద్ద వేసిన మార్కింగ్

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: కొద్ది నెలలుగా డోర్నకల్-మిర్యాలగూడ రైల్వేలైన్ ప్రతిపాదనలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుండగానే సర్వే సంస్థ బాధ్యులు మార్కింగ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలంలోని పలు గ్రామాల మీదుగా రైల్వేలైన్ నిర్మాణ ప్రతిపాదనలు రాగా... ఇక్కడి రైతులు ఎంపీలను కలిసి సమస్యను వివరించడంతో అప్పట్లో తాత్కాలికంగా వాయిదా పడింది. మళ్లీ ఇప్పుడు నేలకొండపల్లి మండలంలోని రామచంద్రాపురం వద్దే కాక అమ్మగూడెం వద్ద నంబర్లతో రాళ్లు ఏర్పాటు చేశారు. దీంతో డోర్నకల్-మిర్యాలగూడెం రైల్వేలైన్ పనులు మొదలుకానున్నాయనే ప్రచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల మీదుగా డోర్నకల్-గద్వాల రైల్వేలైన్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, డోర్నకల్-గద్వాల లైన్ కోసం ఖమ్మం రూరల్ మండలంలోని చింతపల్లి మీదుగా తిరుమలాయపాలెం మండలంలోని జగన్నాథపురం కూసుమంచి మండలం మీదుగా రైల్వే అధికారులు సర్వేచేసి మార్కింగ్ ఇచ్చారు. ఇలా పలుచోట్ల మా ర్కింగ్‌తో హద్దు రాళ్లు ఏర్పాటు చేయడం, జెట్ విమానం సర్వేకోసం చక్కర్లు కొట్టిన నేపథ్యాన త్వరలో పనులు మొదలుకానున్నాయని చెబుతున్నారు.

### రైతుల్లో ఆందోళన..

తిరుమలాయపాలెం మండల కేంద్రంతో పాటు కూసుమంచి మండలాల మీదుగా డోర్నకల్-మిర్యాలగూడ, డోర్నకల్-గద్వాల లైన్ల నిర్మా ణం జరగనుందనే ప్రచారం జరుగుతోంది. అయితే, లైన్ల ప్రతిపాదనలపై ఏ శాఖ అధికారులూ స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొద్ది రోజుల క్రితం ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు గుట్ట, తిరుమలాయపాలెం రైతు వేదిక, పాపాయిగూడెం సమీపాన మార్కింగ్ ఇచ్చారు. దీంతో ఈ ప్రాంత రైతులు తమ విలువైన భూములు రైల్వే లైన్ క్రింద కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తిరుమలాయపాలెం మండలంలో తానంచర్ల, శ్రీరాంసాగర్, సీతారామ ప్రాజెక్టుల కింద విలు వైన భూములను కోల్పోగా ప్రస్తుతం రైల్వే లైన్లతో మళ్లీ భూములు కోల్పోవాల్సి వస్తుందా అన్న భయం వారిని వెంటాడుతోంది. మండల కేంద్రంలో ఎకరా కు రూ.50 లక్షల నుండి రూ.కోటి వరకు ధర పలుకుతుండగా రైల్వేలైన్ సర్వేలతో కొనుగోళ్లు, అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకుని రైల్వే లైన్ల మార్గాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రైతులు కోరుతున్నారు.